అధ్వానంగా ఆట స్థలాలు

- బండరాళ్లతో నిండిన క్రీడా మైదానాలు
- ఆడుకోవడానికి అనువుగా లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అధికారుల చర్యలు శూన్యం



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో కొండ రాళ్లు

గన్నవరం రూరల్: క్రీడలతో విద్యార్థులకు మనో వికాసం కలుగుతుంది. అయితే దానికి కావాల్సిన క్రీడా మైదానాలు మాత్రం అధ్వాన దుస్థితిలో ఉన్నాయి. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం హైస్కూల్‌లు, గురుకుల పాఠశాల ఆవరణల్లో ఉన్న ఆట స్థలాలు విద్యార్థులు ఆడుకునేందుకు ఏ మాత్రం వీలు లేకుండా ఉన్నాయి. వీటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 290మంది, గురుకుల పాఠశాలల్లో 600 మంది, ముస్తాబాద హైస్కూల్‌లో 280 మంది, గొల్లనపల్లిలో 200కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరి శ్రేయస్సు కోసం దశాబ్దాల క్రితమే ఆట స్థలాలు ఏర్పాటు చేశారు. క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మానసిక వికాసం, శారీరక దృఢత్వం కలుగుతుంది.

అభివృద్ధికి నోచుకోని క్రీడా మైదానాలు

వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలల్లో జిల్లాలోని నలుమూలల నుంచి సీట్లు పొందిన విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఆవరణ మొత్తం సుమారు మూడెకరాలకు పైగా ఖాళీగా ఉంది. అయితే కొండ పోరంబోక కావడంతో పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. నడిచేందుకు కూడా వీలు లేని దుస్థితిలో ఈ మైదానం ఉంది. దీనిని అభివృద్ధి చేయాలని అనేక సార్లు గురుకుల సొసైటీకి ఇక్కడి అధికారులు విజ్ఞప్తి చేశారు. అయినా చర్యలు శూన్యం కావడంతో రాళ్ల మధ్య విద్యార్థినులు ఆటలు కొనసాగిస్తున్నారు. దీంతో అనేక సందర్భాల్లో విద్యార్థులు గాయాల పాలవుతున్నారు. అలాగే వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ ఆవరణ మొత్తం కొండ రాళ్లతో నిండి ఉంది. చదునుగా ఉన్న ప్రదేశంలో తాత్కాలికంగా ఆటలు ఆడిస్తున్నారు. ఈ పాఠశాల్లో తెంపల్లి, బల్లిపర్రు, కొత్తగూడెం, మెట్లపల్లి, బండారుగూడెం గ్రామాల విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆడుకునేందుకు అనువైన క్రీడా మైదానం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌కు సంబంధించి క్రీడా మైదానం పక్కనే ఉన్న పెద చెరువులో మునిగి ఉంది. దీనిని బాగుజేయించి చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యార్థులకు ఆటలు ఆడేందుకు అనువైన పరిస్థితి ఏర్పాటు చేయాల్సి ఉంది. పాఠశాల ఆవరణ సుమారు మూడు ఎకరాలకు పైగా నీట మునిగి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆటలు, మానసిక వికాసం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



నీటిలో మునిగి ఉన్న ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం

మానసిక వికాసానికి క్రీడలు అవసరం



పాఠశాలలకు క్రీడా మైదానాలు ఎంతో అవసరం. విద్యార్థుల శారీరక దృఢత్వానికి ఆటలు ఉపయోగపడతాయి. క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి విద్యార్థులను బహుముఖంగా తీర్చిదిద్దాలి.

– ఎల్వీ గంగాధరరావు, సావరగూడెం

14న పేరంటాలమ్మ ఆలయంలో గ్రామ సభ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించనున్న సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన ఆలయ ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో సంక్రాంతి జాతర మహోత్సవాలు–2025 సందర్భంగా గ్రామ పెద్దల సూచనలు, సలహాల కొరకు దేవదాయ శాఖాధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామ ఇరుపెద్దలు పాల్గొని ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన సూచనలు ఇవ్వవలసిందిగా కోరారు.

నేడు తేలప్రోలులో రెవెన్యూ సదస్సు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు గ్రామ సచివాలయాలు– 1, 2ల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె. విమలకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ సభలో అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. రెవెన్యూ సమస్యలు ఉన్నవారు అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవా సదనం నిర్మాణానికి విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సేవా సదనం నిర్మాణానికి భక్తులు రూ. 1,00,116లు అందజేశారు. వైజాగ్‌కు చెందిన కాసన్నేని రామ్మోహన్‌రావు, సుగుణ దంపతులు రూ. 50,116లు ఇచ్చారు. కామినేని వెంకటకృష్ణారావు(ఆస్ట్రేలియా) రూ. 50 వేలు అందించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు విరాళం చెక్‌లను భక్తులు అందజేశారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

పెనమలూరు: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని మణిపాల్ ఆస్పత్రి ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ ధర్మేంద్ర పేర్కొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ధర్మేంద్ర మాట్లాడుతూ అవగాహనతో క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్ల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించగలిగితే వ్యాధి నివారణకు అవకాశం ఉంటుందని చెప్పారు. నేడు క్యాన్సర్ నివారణకు ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రూప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన ఆంధ్రనాట్య ప్రదర్శనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్ బృందం ఆదివారం ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నాట్యాచారిణి ఆర్ఎస్‌వై రాజేశ్వరి నేతృత్వంలో చిన్నారి కళాకారిణులు తిలోత్తమ బాయి, లక్ష్మీ చైత్ర, తనుశ్రీ, రిషిత, ఉషారాణి, పియూష, హస్విక, నవ్య, హర్షప్రియ, భవానీ తదితరులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రనాట్యంలో అలరింపు, వినాయక కౌతం, దశావతారాలు, థిల్లాన, సంధ్య సమయం, వేణుగాన రవంబు, ముద్దుగారే యశోద, జయ జగజ్జనని అంశాలకు చక్కని హావభావాలతో అభినయిస్తూ నర్తించి భక్తుల హర్షధ్వానాలను అందుకున్నారు. కార్యక్రమానికి ధూపాటి శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ శాస్త్రి కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

55 ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం నిర్వహణ

గన్నవరం: మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో మండలంలోని 5,600 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన సమగ్ర ప్రగతి పత్రాలను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేసినట్లుగా చెప్పారు. ఈ పత్రాల్లో విద్యార్థులకు సంబంధించిన ఎఫ్ఏ-1, 2 పరీక్ష ఫలితాలు, హాజరు శాతం, ఇతర అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు టాగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేసినట్లుగా పేర్కొన్నారు. పీటీఎం సమావేశాలకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

సద్గురువులకు స్వర నీరాజనం

విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు వాగ్గేయకారుడు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భంగా గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంశానికి చెందిన సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సద్గురువులకు స్వర నీరాజనాలు అందించారు. స్వీయ రచన వర్ణంతో ప్రారంభించి ఈ వసుధ, అప్పరామ భక్తి తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై మల్లాజోస్యుల శివతేజ, మృదంగంపై కుందుర్తి అరవింద్, ఘటంపై హరిబాబు సహకరించారు. అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.

వీరజవానుల కుటుంబాలను ఆదుకోవాలి

కలెక్టర్ డీకే బాలాజీ



పోరంకిలో విరాళం అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: వీరజవానుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. పోరంకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ పాల్గొని మాట్లాడారు. సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందజేయడానికి ముందుకు రావాలని కోరారు. ప్రతి ఏటా డిసెంబర్ ఏడవ తేదీన సాయుధ దళాల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రక్షణ కోసం కంటి రెప్పలా కాపాడుతున్న జవానుల సేవలు మరువలేనివన్నారు. పతాక నిధికి విరాళాలు అందించే దాతలకు ఆదాయ పన్నులో రాయితీ లభిస్తుందన్నారు. సైనిక సంక్షేమ అధికారిణి డాక్టర్ కే కల్యాణి వీణ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా 62067742138కు నేరుగా విరాళాలు అందజేయవచ్చని వివరించారు. జిల్లా నుంచి పతాకనిధికి ఇప్పటి వరకు రూ. 12,51,776 సేకరించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులు అరెస్టు

ఉయ్యూరు: ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని పట్టణ ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో ఈనెల ఏడవ తేదీన మొవ్వ మండలానికి చెందిన పల్లిపోగు సునీల్, పమిడిముక్కల మండలం చోరగుడి గ్రామానికి చెందిన దాసరి సుదీర్‌కుమార్ విధి నిర్వహణలో ఉన్న ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యానికి దిగారు. చికిత్స నిమిత్తం బంధువుని ఆసుపత్రికి తీసుకొచ్చిన ఇరువురు యువకులు ఆసుపత్రి స్టాఫ్ నర్సు అరుణకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ బాషా, అటెండర్లు జోషి, కరుణాకర్‌తో దురుసుగా ప్రవర్తించి, ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఆసుపత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు యువకులపై కేసు నమోదు చేసి ఆదివారం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

విద్వేష రాజకీయాలు తగదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అధికార గర్వంతో రాజ్యాంగ పునాదులను పెకలించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని, దేశ భవిష్యత్ దృష్ట్యా ఇలాంటి చర్యలను ప్రజలు గమనించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ అన్నారు. ఆయన లబ్బీపేటలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవానికి దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల మధ్య ఐక్యత సోదరభావం దృఢంగా ఉందన్నారు. అధికారం శాశ్వతం కాదని గుర్తు చేసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లుకు ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చదువులో రాణిస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం



మనస్వినిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్, డాక్టర్ దుట్టా, కాపు ప్రముఖులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువులో రాణించినప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయంగా కాపు వర్గీయుల అభివృద్ధి సాధించగలరని పలువురు వక్తలు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని దుట్టా కృష్ణామూర్తి బృందావన్ గార్డెన్స్‌లో హనుమాన్‌జంక్షన్ పట్టణ, బాపులపాడు మండల కాపు వనసమారాధన ఆదివారం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి), కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఏపీఆర్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అను హాస్పిటల్స్ అధినేత డాక్టర్ గాజుల రమేష్, సినీ నటుడు పృథ్వీరాజ్, ప్రముఖ వైద్యుడు దుట్టా రామచంద్రరావు హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ కాపు సామాజికవర్గం ఐకమత్యంగా మెలగాలని సూచించారు. అనంతరం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 599 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిన ఆకుల వెంకట నాగసాయి మనస్వి, ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, జనసేన పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రసాద్, ఏపీ తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు, ఏపీ నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ నక్కా గాంధీ, ముసునూరు ఎంపీపీ కొండా పద్మ, శేరినరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, అభయాంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కేతినీడి జైనేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బుద్దవరం – మానికొండ రోడ్డుకు మోక్షం



బుద్దవరం వద్ద రోడ్డుపై తొలగించిన తారు లేయర్

గన్నవరం: మండలంలోని బుద్దవరం నుంచి మానికొండ ఆర్అండ్‌బీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రహదారి విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభించింది. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం నుంచి బూతుమిల్లిపాడు, దాసులపాక, తరిగొప్పల, మానికొండ, కాటూరు, కలవపాముల వెళ్లేందుకు ఈ రహదారే ప్రధాన మార్గం. సుమారు ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారి ప్రస్తుతం కుంగిపోవడంతో పాటు పూర్తిగా దెబ్బతిని గోతుల మయంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఈ రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపన కూడా చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల నిలిచిపోయిన ఈ రహదారి విస్తరణ పనులు ఇప్పుడు పట్టాలెక్కాయి. సుమారు రూ. 12 కోట్లు వ్యయంతో బుద్దవరం రోడ్డు నుంచి తరిగొప్పల ఆలయం వరకు ఏడు కిలోమీటర్ల పొడవునా డబుల్ లైన్ రహదారిగా విస్తరించనున్నారు. ప్రస్తుతం రహదారిపై తారు లేయర్‌ను తొలగించి రోడ్డు బలోపేతానికి రోలింగ్ చేస్తున్నారు. రహదారిని పూర్తిస్థాయిలో పటిష్ట పరిచిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీహరి తెలిపారు.

అంతా మా ఇష్టం

నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ సభ్యత్వాల నమోదు



పంచాయతీ కార్యాలయంలో టెంట్ వేసి సభ్యత్వాలు నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

రామవరప్పాడు: ప్రభుత్వం మాది మేము చేసేదే చట్టం, చెప్పిందే న్యాయం అన్న రీతిలో టీడీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారు. నియమ నిబంధనలు సామాన్యులకే.. మాకు కాదు అన్నట్లు చేస్తున్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. పంచాయతీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద టెంట్ ఏర్పాటు చేసి, టీడీపీ జెండాలు కట్టి నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలను నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పార్టీ కార్యక్రమాలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయకూడదు. ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలి. కాని ఇవేవి పట్టని టీడీపీ నాయకులు సభ్యత్వాలను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఎన్.నరసింహారావుకు పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ సెలవు రోజు కావడంతో తానేమి చేయలేనని మిన్నకుండిపోవడం గమనార్హం. దీంతో ఎంపీడీఓకు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు.

భవనాల తొలగింపునకు క్లియరెన్స్

- జాతీయ రహదారిపై వివాదాలు పరిష్కారం
- సర్వీస్ రోడ్లపై స్థానికుల్లో ఆశలు



రహదారి పక్కన ఉన్న భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న పలు భవనాలు తొలగింపునకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. దీంతో భవనాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిని గత 10 సంవత్సరాల క్రితం విస్తరించారు. కానూరు పెట్రోల్ బంక్ నుంచి పోరంకి చేపల కుండీల వరకు 150 అడుగులు, చేపల కుండీల నుంచి మచిలీపట్నం వరకు 200 అడుగుల వెడల్పున రోడ్డు విస్తరించారు. అయితే పోరంకి పరిధిలో రహదారి విస్తరణ సమయంలో వివాదాలు తలెత్తాయి. దీంతో రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న పలు భవనాలు నేటికి అలాగే ఉండిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రహదారి ప్రమాదంగా మారింది.

పరిహారం చెల్లింపు

కాగా జాతీయ రహదారి పక్కన గతంలో వదిలేసిన మూడు భవనాలకు వివాదాలు పరిష్కారమయ్యాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కోర్టులో పరిహారంపై ఉన్న వివాదం, కుటుంబ పార్టీషన్‌లకు సంబంధించి వివాదాలు పరిష్కారం కావడంతో భవనాలు తొలగింపు మొదలు పెట్టారు. భవన యజమానులకు ఎన్‌హెచ్ఐ పరిహారం చెల్లించారు. పోరంకి తూముల సెంటర్‌లో ఒక భవనం తొలగింపు పనులు భవన యజమాని చేపట్టారు. ఇంకా రెండు భవనాలు తొలగించాల్సి ఉండగా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాగా పోరంకిలో శ్మశానవాటిక భవనంతో పాటు, గుడి, ప్రార్థనా మందిరం వద్ద రోడ్డు విస్తరణ విషయం తేలాల్సి ఉంది. వీటిని అధికారులు పరిష్కరించాల్సి ఉంది.



పోరంకి పరిధిలో రహదారి పక్కనే ఉన్న భవనాలు

సర్వీస్ రోడ్లు వేయండి..

పోరంకిలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో సర్వీస్ రోడ్లు వేయాలని గ్రామప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుకు 150 అడుగులు విలువైన స్థలం సేకరించిన ఎన్‌హెచ్ఐ కేవలం 80 అడుగులే విస్తరించింది. మిగితా రోడ్డు స్థలాన్ని వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అయితే పోరంకిలో సర్వీస్ రోడ్లు లేకపోవడం, ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ఐ రోడ్డు విస్తరణ కోసం సేకరించిన స్థలాన్ని అలాగే వదిలేస్తే భవిష్యత్తులో ఆక్రమణదారుల చేతుల్లోకి స్థలం శాశ్వతంగా వెళ్లిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. డివైడర్‌లు కట్టింగ్‌లు లేకపోవడంతో వన్‌వేలో ఎదురెదురుగా వాహనాలు వస్తుండటంతో సమస్య తీవ్రంగా ఉంది. సర్వీస్ రోడ్లు లేని కారణంగా తరచుగా ట్రాఫిక్ జామ్ అవ్వడంతో పాటు, అనేక ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌హెచ్ఐ అధికారులు తక్షణం స్పందించి ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి సాధనకు వచ్చే నెల 5వ తేదీన కృష్ణా జిల్లా గన్నవరంలోని కేసరపల్లి గ్రౌండ్స్‌లో జరిగే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే శంఖారావం కార్యక్రమం సన్నాహకంగా ఆదివారం బస్టాండ్ నుంచి కృష్ణలంకలోని పలు వీధుల మీదుగా కనకదుర్గ వారధి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్యంగారి హోటల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేవాలయాలు ప్రభుత్వ హస్తాల నుంచి విడుదల కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. అన్యమతస్తులు దేవాలయాల్లో ఉద్యోగం చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో హైందవ జాగృతి సమితి అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరెడ్డి, హిందూ సంఘాల నాయకులు శనగపల్లి మల్లికార్జునరావు, పరిమి గోవర్ధన్, వెంకటకృష్ణ, ముఖేష్ రెడ్డి, శ్రీకాంత్, బత్తిన హరి, వాసా పల్లపరాజు డి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు

విజయవాడకల్చరల్: గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా భావించాలని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో గోపాలరెడ్డి రోడ్డులోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంపై సదస్సును నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు చైతన్య వేదికలుగా ఉండేవని, నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే గ్రంథాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థలో మార్పుల కోసం అరసం కృషి చేస్తోందన్నారు. గ్రంథాలయోద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్ నాయుడు, అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, కార్యదర్శి జి.లక్ష్మి, బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ఎస్.వెంకటనారాయణ పాల్గొన్నారు.

భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు

విజయవాడకల్చరల్: సాహితీ మిత్రలు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో ఆదివారం భగవంతం కథల సంపుటి లోయ చివరి రహస్యం, శీరంశెట్టి కాంతారావు నవల పరంపర పరిచయ సభను నిర్వహించారు. కథా రచయిత భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని విఖ్యాత రచయిత వాడ్రేవు వీరలక్ష్మీదేవి పేర్కొన్నారు.